జలసిరిని కాపాడుకుంటేనే మనుగడ

- నీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి
- ఘనంగా ప్రపంచ జల సంరక్షణ దినోత్సవం

అంబర్‌పేట్: నీటి సంరక్షణ, పొదుపుగా వినియోగించే విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ రాజ్‌కుమార్ తెలిపారు. యూనైటెడ్ నేషన్స్ ఈ ఏడాదిని పీస్ ఫర్ వాటర్‌గా ప్రకటించారని ఆయన వెల్లడించారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో జరిగిన నీటి దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నీటి ప్రాముఖ్యతపై శిక్షణ పొందే అభ్యర్థులకు పలు అంశాలను వివరించారు. నీటి లభ్యత, వినియోగాలు, ప్రాధన్యత వంటి అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్, ఎస్‌పి మధుకర్ సార్‌లు మాట్లాడుతు.. నీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన సూచించారు. నేడు నీటి సంరక్షణకు ప్రాముఖ్యత ఇస్తేనే భవిష్యత్తులో నీటి అవసరాలు తీరుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, డీఎస్పీలు పిచ్చయ్య, విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రొఫెసర్ రాజ్‌కుమార్...



ర్యాలీలో పాల్గొన్న అంబేద్కర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

జల వనరులను సంరక్షించుకోవాలని విద్యార్థుల ర్యాలీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భవిష్యత్ తరాల అవసరాల నిమిత్తం జల వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ అన్నారు. శుక్రవారం జల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ... జల సిరులతో కలకలలాడే చెరువులు, మానవ జాతి ప్రగతికి చేదోడువాదోడుగా ఉంటాయన్నారు. విద్యార్థులు నీటి సంరక్షణ స్లోగన్‌తో వీధుల్లో పర్యటిస్తు ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆఫీసర్లు కుమారస్వామి, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ కె.మాధవి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

ముషీరాబాద్: భవన నిర్మాణదారులు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ కమిషనర్ ఖాదర్‌మోహియుద్దీన్ సూచించారు. అపార్ట్ మెంట్ నిర్వహకులు విధిగా ఇంకుడు గుంతల నిర్వహణ చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ప్రపంచ వాటర్ డేను పురస్కరించుకొని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతల నిర్వహణ తీరును పరిశీలించారు. జలమండలి సిబ్బందితో కలిసి ఇంకుడు గుంతలను పరిశీలించిన ఆయన పారిశుద్ధ్య నిర్వహణ తీరును వాకబు చేశారు. సర్కిల్ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్‌లను సందర్శించిన డీఎంసీ ఇంకుడు గుంతలు ఉన్నవి లేనివి ఆరా తీయడంతో పాటు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భవన నిర్మాణాలు చేపడుతున్నవారు జలమంలి పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు హఫీజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న సర్కిల్‌-15 డీసీ ఖాదర్‌మోహియుద్దీన్

నీటి యుద్ధాలను నివారించాలి...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వివిధ దేశాలు, రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న నీటి యుద్ధాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణవేత్త దొంతి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రజాశాస్త్రవేత్తలు, చిత్తనూరు విత్తనాల కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తులో తీవ్రంగా నీటి కొరత ఏర్పడబోతుందని నీటి కోసం దేశాల మధ్య యుద్ధాలు జరిగే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల వల్ల ఏర్పడిన నీటి కాలుష్యం వల్ల కేన్సర్ లాంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఐఐసీటీ విశ్రాంత శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ... ప్రజలు మొదటగా ప్రభుత్వాల అభివృద్ధి నమూనాలను ప్రశ్నించాలన్నారు. ఫార్మా రంగం వల్ల మన రాష్ట్రంలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడమేకాకుండా నీటి కాలుష్యం పెరుగుతుందన్నారు. ముంబై ఐఐటీ శాస్త్రవేత్త సాగర్ దారా, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు కవుల సరస్వతి, కె.జె.రామారావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, పర్యావరణవేత్త ఎం.ఎ.సత్యనారాయణ, పాలమూరు అధ్యాయన వేదిక నాయకులు సుదర్శన్, కె.చక్రవర్తి, పి.శంకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త దొంతి నర్సింహారెడ్డి

కేంద్రంలో బీజేపీకి అధికారం ఖాయం

కవాడిగూడ: గడచిన దశాబ్దకాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన వికసిత్ సంకల్ప్ భారత్ వాహనాన్ని శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కె.పరిమళ్‌కుమార్, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సి.మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నేతలు శివరాజ్, బొలరమేష్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను భారత్ సంకల్ప్ పత్రం కోసం నేరుగా ప్రధాని మోదీకి సలహాలు, సూచనలు పంపేందుకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు ప్రజలు మిస్ కాల్ చేసి వారి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలపవచ్చని అన్నారు. ఎన్ని పార్టీలు కుమ్మక్కైనా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించి మూడో సారి అధికారంలోకి రావడం ప్రధాని నరేంద్రమోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని వారు పేర్కొన్నారు. దేశంలో గత పది సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీజేపీకి ప్రజలు మరోసారి ఓటు వేసి గెలిపిస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూడా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని వారు పేర్కొన్నారు.

నియామకం


నర్సింగ్‌రావు

నల్లకుంట: బీజేపీ నల్లకుంట డివిజన్ కన్వీనర్‌గా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.బి.నర్సింగ్ రావు నియమితులయ్యారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం నల్లకుంటలో నర్సింగ్‌రావు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, గౌతంరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రికెట్ క్రీడాకారులతో కమిటీ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్

కాచిగూడ: విద్యార్థులు చదువుతో పాటు మరింత పట్టుదలతో క్రీడల్లోనూ రాణించాలని వైశ్య హాస్టల్ కమిటీ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. కాచిగూడలోని వైశ్య హాస్టల్, ట్రస్టబోర్డు స్పోర్ట్స్ మీట్–2024 క్రికెట్ టోర్నమెంట్‌ను అంబర్‌పేట జలమండలి క్రికెట్ గ్రౌండ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించి వైశ్యుల కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటాలని కోరారు. వీరబొమ్మ శ్రీనివాస్, టి.శ్రీనివాస్, పి.రాజేశ్వర్ రావు, బి.దామోదర్, మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నింబోలిఅడ్డాలో నీటి వృథాకు చెక్

కాచిగూడ: నింబోలిఅడ్డా ప్రధాన రహదారిపై ఉన్న మంచినీటి పైప్‌లైన్ వాల్వు గత కొద్ది రోజుల క్రితం చెడిపోయి మంచినీరు రోడ్డుపై వృథాగా పోతోంది. శుక్రవారం కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ స్పందించి సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. జలమండలి సిబ్బంది మంచినీటి వాల్వుకు మరమ్మతులు చేపట్టిన నీటి వృథాను అరికట్టారు. వేసవిలో నీటి ఎద్దడి దృష్ట్యా మంచినీరు వృథాకాకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, ఓంప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేగోని రవికుమార్‌కు తెలుగు యూనివర్సిటీ పురస్కారం


కీర్తి పురస్కారాన్ని అందుకున్న చేగోని రవికుమార్

అంబర్‌పేట్: గ్రంథాలయ రంగంలో విశేష సేవలు అందించిన సిటీ కాలేజ్ గ్రంథ పాలకులు చేగోని రవికుమార్ తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్‌రావు, విశ్రాంత న్యాయమూర్తి ఎం.రాజేందర్‌ల చేతులమీదుగా అందుకున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ పురస్కారం తన వృత్తిలో మరింత బాధ్యతను పెంచిందన్నారు.

బీఆర్‌ఎస్‌లో గూటికి అబ్రార్ హుస్సేన్ ఆజాద్


అబ్రార్ హుస్సేన్ ఆజాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఎస్పీ మైనార్టీ కన్వీనర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన భోలక్‌పూర్‌కు చెందిన అబ్రార్ హుస్సేన్ ఆజాద్ తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన ఆజాద్ శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలవగా ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ... గతంలో టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి 18 సంవత్సరాల పాటు పని చేశానని, ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ పార్టీలో చేరిన సందర్భంగా ఆయనకు మద్దతుగా బీఎస్పీలో చేరి మూడు సంవత్సరాల పాటు పని చేసినట్లు తెలిపారు. అయితే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భాన్ని పురస్కరించుకొని మళ్లి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేత కృష్ణగౌడ్


వీహెచ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణగౌడ్

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన కృష్ణగౌడ్ శుక్రవారం డీడీ కాలనీలోని మాజీ ఎంపీ వి.హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కృష్ణగౌడ్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ప్రధాన అనుచరుడుగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని ఈ సందర్భంగా వీహెచ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానని కృష్ణగౌడ్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న నాయకులకు కార్యకర్తలకు గౌరవం లేదని ఆయన అన్నారు. కృష్ణగౌడ్ వెంట దిలీప్, నరేశ్ తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, గరిగంటి రమేష్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, నారాయణ స్వామి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, దిడ్డి రాంబాబు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కవులు ప్రజలను చైతన్యం చేయాలి: కొలకలూరి ఇనాక్


పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను చైతన్య చేయాలని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ కవిత దినోవాద్సవం సందర్భంగా భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ విమల సాహిత్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ సమాజ హితం కోసం రాసే కవిత్వాలు కలకాల మనగలుగుతాయన్నారు. ప్రముఖ కవి కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ డి.వి.రాజగోపాల్ రాసిన అక్షరాలు అవే భావాలు ఎన్నో కవిత సంపుటిపై పలువురు ప్రసంగించారు. ప్రముఖ కవి నాలేశ్వరం శంకరం, డాక్టర్ జల్ది విద్యాధర్, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, పి.శ్రీనివాస్‌గౌడ్, దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొలకలూరి ఇనాక్‌తో పాటు పలువురు కవులను ఘనంగా సన్మానించారు.

కుండలకు తగ్గని క్రేజ్



లాలాపేట: నీటిని చల్లగా ఉంచే ఎన్నో రకాల ఫ్రిజ్‌లు అందుబాటులోకి వచ్చినా మట్టి కుండలకు మాత్రం ఆదరణ తగ్గడం లేదు. ఆరోగ్యం దృష్ట్యా ప్రజలు మట్టితో తయారు చేసిన పాత్రలు, కుండలను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. మారుతున్న కాలానుగుణంగా కుమ్మర్లు, తయారీదారులు మట్టితో కుండలతో పాటు వివిధ రూపాల్లో రంజన్లు, వాటర్ బాటిల్‌ను తయారు చేసి వినియోగదారులకు మార్కెట్‌లో అందుబాటులో తీసుకువస్తున్నారు. మరింత సౌకర్యం కోసం వాటికి ట్యాప్‌లను అమర్చారు. లాలాపేట అంబేడ్కర్ విగ్రహం సమీపంలో కుమ్మర్లు రోడ్డు పక్కన కుండలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. మట్టి కుండలో నీరు తాగటంతో ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయని వైద్యులు సైతం సూచిస్తున్నారు. మట్టితో తయారు చేసిన వాటర్ బాటిళ్లు, కుండలకు గిరాకీ పెరుగుతోందని నిర్వాహకులు కుమ్మరి ఆంజనేయులు పేర్కొన్నారు.

నేడు, రేపు న్యాయవాదుల క్రీడా పోటీలు

కాచిగూడ: తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘం రజతోత్సవాలలో భాగంగా న్యాయవాదులకు కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు పందెం, మహిళా న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ మణికొండ ప్రవీణ్ తెలిపారు. 23న శనివారం ఉదయం 8 గంటలకు న్యాయమూర్తులు క్రీడా పోటీలు ప్రారంభిస్తారని, 24న ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విజేతలకు హైకోర్టు న్యాయమూర్తి బహుమతులు అందజేస్తారని తెలిపారు. అడ్వకేట్ సొసైటీ అధ్యక్షుడు ఆలుగడ్డల అనిల్ కుమార్, కార్యదర్శి పాలిశెట్టి రవి, ఆకుల మాణిక్ ప్రభు, కొండూరు వినోద్ కుమార్, అనిల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రేపు కాపు వధూవరుల పరిచయ వేదిక

కాచిగూడ: కాపు క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్ ఫతేమైదాన్ క్లబ్‌లో కాపు వధూవరుల పరిచయ వేదికను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకుడు ఎస్.శరత్ శ్యామ్ తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపు క్లబ్ ప్రతినిధులు ఎం.సాయిబాబు, బి.సుమన్ ప్రకాష్, ఎ.ఎం.అనురాధలతో కలిసి ఆయన మాట్లాడుతూ... మున్నూరుకాపు, బలిజ కాపు, తెలగ కాపు, కాపు ఉప కులాలకు చెందిన వధూవరులు ఈ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకుని సంబంధాలను కుదుర్చుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 97017 14466లో సంప్రదించాలని కోరారు.

ఆప్టోమెట్రీలో గోల్డ్‌మెడల్ సాధించిన దీపిక



అంబర్‌పేట్: పేదింటి విద్యార్థిని సి.దీపిక ప్రముఖ విశ్వ విద్యాలయంలో ఆప్టోమెట్రీ పీజీ కోర్సులో టాపర్‌గా నిలిచింది. పూణెలోని భారతీ విద్యాపీఠం విశ్వవిద్యాలయంలో బ్యాచ్ టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఇటీవల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ డాక్టర్ రమేశ్ బైస్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాట్లు శుక్రవారం విద్యార్థిని తల్లిదండ్రులు ఆనందంతో తెలిపారు.

'నిషా'చరులకు జైలు శిక్ష!

కాచిగూడ: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందికి కోర్టు జైలు శిక్ష విధించిందని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనుమల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 20, 22వ తేదీల్లో చేపట్టిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకుని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురికి 2 రోజులు, 12 మందికి 4 రోజులు, ఒకరికి 22 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- నేడు బీసీ జోడో యాత్ర
- విజయవంతం చేయండి
- బీసీ సంక్షేమ సంఘం


మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: బీసీల హక్కుల సాధనకై శనివారం విద్యానగర్ బీసీ భవన్ నుంచి ప్రారంభమయ్యే బీసీ జోడో యాత్రను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ భవన్ వద్ద ఉదయం 8:30 గంటలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జోడో యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం సీట్లు కేటాయించాలని అన్నారు. బీసీలను విస్మరించే పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ బీసీ జోడో యాత్ర జరుగుతుందని తెలిపారు. మొదటగా నల్లగొండ జిల్లాకు చేరుకుంటుందని, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్, వేముల రామకృష్ణ, నందగోపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించుకోవాలి



'సత్రంగ్'ను ప్రారంభించిన ప్రొఫెసర్ అలేఖ్య

కాచిగూడ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన గురుతర బాధ్యత యువతపై ఉందని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పుంజాల అలేఖ్య అన్నారు. కాచిగూడలోని బద్రుకా కళాశాలలో 'సత్రంగ్–2024' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫెస్ట్‌ను శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సృజనాత్మక ఆలోచనతో ముందుకు వెళ్లాలని, పోటీ ప్రపంచంలో రాణించాలంటే మెళకువలను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సత్రంగ్ (ఇంద్రధనస్సులోని రంగులు) ఫెస్ట్‌లో నగరంలోని 25 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. నృత్యకళ, స్వర్ణోత్సవ్, అనుక్రీతి, రంగ్ మంచ్, టాలెంట్ షో, ది ఫాంటమ్ అబిస్, కుచ్ తుమ్ కహో కుచ్ హమ్, పెయింటింగ్, పాట్ పెయింటింగ్, రంగోలి, మెహిందీ, వెజిటబుల్ కార్వింగ్, మండాలా ఆర్ట్ ఫ్లవర్ అరేంజ్‌మెంట్ తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బద్రుకా కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, డాక్టర్ పి.పెంటయ్య, డాక్టర్ ఎం.జానకిరామ్, మడుపు ఫణీంద్ర, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని తమదిగా నమ్మించి..

రూ. కోట్లు కాజేసిన నలుగురి అరెస్టు

బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలాన్ని తనదిగా నమ్మించి కోట్లాది రూపాయలను దండుకొని మోసం చేసిన వ్యవహారంలో నలుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌కు చెందిన కాటంరెడ్డి శశిధర్‌రెడ్డి అనే వ్యాపారి శ్రీవెన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ పేరుతో సంస్థ నిర్వహిస్తున్నారు. అతడికి రెండేళ్ల క్రితం బీసీ మైలారప్ప అనే వ్యక్తి ద్వారా బెంగుళూరుకు చెందిన కృష్ణప్రసాద్, ఆర్.జగన్నాథ్, గున్నా సురేందర్‌రెడ్డి అనే వ్యక్తులు పరిచయం అయ్యారు. బెంగుళూరులోని ఎలహంక ప్రాంతంలోని హోసనహళ్లి గ్రామంలో తనకు 11.30 ఎకరాల స్థలం ఉందని, దానిని డెవలప్‌మెంట్‌కు ఇస్తానని నమ్మించారు. వేరే చోట ప్రభుత్వానికి కృష్ణ ప్రసాద్ తండ్రి గోపీనాథ్ స్థలం ఇవ్వడంతో దానికి బదులుగా ఎలహంకలో స్థలాన్ని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని నమ్మబలికారు. సరైన బిల్డర్ దొరికితే స్థలాన్ని డెవలప్‌మెంట్‌కు ఇస్తామని, లేకుంటే అమ్మేస్తామని చెప్పారు. వారి మాటలు నమ్మిన శశిధర్‌రెడ్డి రూ. 14 కోట్లకు స్థలాన్ని కొనేందుకు అంగీకరించారు. దీని కోసం రూ. 5.35 కోట్లను కృష్ణ ప్రసాద్‌తో పాటు జగన్నాథ్‌కు చెందిన జాకాన్ బిల్డింగ్ సొసైటీకి చెల్లించారు. కొన్నాళ్ల తర్వాత వాకబు చేయగా స్థలంపై కృష్ణప్రసాద్‌కు ఎలాంటి హక్కులు లేవని, ఆ స్థలాన్ని మొత్తం కర్ణాటక ప్రభుత్వం వైఏఎస్ చారిటబుల్ ట్రస్ట్, కొదాడా సమాజ అనే సంస్థలకు కేటాయించినట్లు తేలింది. తనను మోసం చేసేందుకు బోగస్ పత్రాలతో స్థలం తమదేనని నమ్మించిన కృష్ణప్రసాద్, గున్నా సురేందర్‌రెడ్డి, బీసీ మైలారప్పలపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు శశిధర్‌రెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించగా ఐపీసీ 420, 506, రెడ్ విత్ 120(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్‌యాదవ్ అన్నారు. యోచన సేవా సంస్థ అధ్యక్షుడు జానకి సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మహిళలకు చీరలను అందజేశారు. నేతలు గుర్రంశంకర్, శీలం సత్యనారాయణ, జయేందర్‌బాబు, వెంకటగోవిందరావు, వెంకట్రావు, యాదగిరిగౌడ్, గుండు జగదీశ్‌బాబు, అభిషేక్‌కెనడీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌లను కులాల వారీగా ప్రకటించడం మోసపూరిత చర్య

అంబర్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలకు ముందు బీసీలను మభ్యపెట్టేందుకే బీసీ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్ విమర్శించారు. బీసీలు అన్ని కులాలకు కాకుండా కులాల ప్రాతిపదికన కార్పొరేషన్ ప్రకటించడం కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిదర్శనం అన్నారు. బీసీ కార్పొరేషన్‌లకు నిధులు లేకుండా ప్రచారం కోసం కార్పొరేషన్ ప్రకటించడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు ఇలాంటి మోసపూరిత చర్యలకు గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్‌కు చెల్లిందని, తాజాగా ఆదే బాటలో సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని ఆనంద్‌గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపట్ల రాష్ట్ర ప్రజలు ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చారని ఆయన తెలిపారు.

గొల్ల, కురుమలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం తథ్యం

పంజగుట్ట: రాష్ట్రంలో 18 శాతం జనాభా ఉన్న గొల్ల, కురుమలను అన్ని రాజకీయ పార్టీలు దగా చేస్తున్నాయని యాదవ, కురుమ సంఘాల రాజ్యాధికార ఐక్యవేదిక ఆరోపించింది. తమ ఓట్లతో అధికారం చేపట్టి పదవులు ఇచ్చే విశయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహంవ్యక్తం చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేమెంతో మాకంత అనే నినాదంతో ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మేకల కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వివిధ కుల సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి యాదవ్, ప్రొఫెసర్ బీనవేని రామ యాదవ్, క్యామ మల్లేష్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, రమేష్ యాదవ్‌లు మాట్లాడుతూ .. రాష్ట్రంలో గొల్ల, కురుమల మద్దత్తుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించిందన్నారు. లోక్‌సభ సీట్లతో పాటు, నామినేటెడ్ పోస్టుల్లో కూడా సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. గొల్ల, కురుమలను విస్మరించే పార్టీలను రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. తమ జనాభా దామాషా ప్రకారం 3 మంత్రి పదవులు, 2 ఎంపీ, 13 కార్పొరేషన్ చైర్మన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ప్రకటించిన 37 కార్పొరేషన్ చైర్మన్‌లల్లో ఒక్కటి కూడా యాదవ, కురుమలకు ఇవ్వకపోవడం దారుణమని, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడు చూసినా యాదవులు లేని మంత్రివర్గం లేదని మొదటిసారి యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలను శాసించే స్థితిలో ఉన్న గొల్ల కురుమలను విస్మరించిన పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.